telangana chowrastha.com
epaper.telanganachowrasta.com

# తెలంగాణ చౌరస్తా

Voice Of Democracy

సంపుటి: 01 సంచిక:298

24 క్యారెట్లు 1,58,350 | కిలో వెండి 2,58,000 | CHOWRASTHA DIGITALS | 21.05.2026 ఆదివారం, హైదరాబాద్

## అత్యాచార నిందితుడికి ఘన స్వాగతం

- యూపీలో బెయిల్ పై విడుదల పూల దండలు..కాళ్లకు మొక్కుతూ హడావిడి
- బీజేపీ పాలిత రాష్ట్రాల్లో మహిళలకు రక్షణ కరువు
- మహిళా సంఘాలు
- 9 నెలల తర్వాత బెయిల్‌పై లైంగికదాడి నిందితుడికి ఘన స్వాగతం



2



2

## కేంద్ర మంత్రి నిర్మలమ్మకు భట్టి రిక్వెస్ట్

- విద్యారంగ పెట్టుబడులకు ఎఫ్ఆర్బీఎం మినహాయింపు ఇవ్వండి
- రాష్ట్రానికి సంబంధించిన వివిధ అంశాలపై కేంద్ర ఆర్థిక మంత్రితో భట్టి చర్చ
- ఎస్ఏఎస్సీఐ కింద రాష్ట్రానికి అదనంగా రూ.5 వేల కోట్లు ఇవ్వండి
- అభివృద్ధి,సంక్షేమ పథకాలకు మరింత ఆర్థిక మద్దతు కావాలని విజ్ఞప్తి
- నూతనంగా ఏర్పడిన రాష్ట్రాల్లో తెలంగాణ వేగంగా అభివృద్ధి
- యంగ్ ఇండియా స్కూల్స్ గురించి కేంద్రమంత్రికి వివరణ

దిల్లీలో పర్యటిస్తున్న ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌తో సమావేశమయ్యారు. రాష్ట్రానికి సంబంధించిన వివిధ అంశాలపై కేంద్రమంత్రితో చర్చించారు. ఆపై ఎస్ఏఎస్సీఐ కింద రాష్ట్రానికి అదనంగా రూ.5 వేల కోట్లు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. మరోవైపు రాష్ట్రంలోని విద్య, వైద్యం, గ్రామీణ మౌలిక వసతులను వివరించిన భట్టి విక్రమార్క, మానవ వనరుల అభివృద్ధికి రాష్ట్రం చేపట్టిన కార్యక్రమాల వివరాలను తెలిపారు. యంగ్ ఇండియా స్కూల్స్ గురించి కేంద్రమంత్రికి వివరించిన డిప్యూటీ సీఎం, ఆర్థిక వ్యవహారాల శాఖ ఆమోదిత ప్రాజెక్టులకు ఎఫ్ఆర్బీఎం పరిమితి మినహాయింపు కోరారు.

*-తెలంగాణ చౌరస్తా స్టేట్ బ్యూరో*

## నేడు తమిళనాడు కేబినెట్ విస్తరణ

- విజయ్ ప్రభుత్వంలోకి కాంగ్రెస్
- ఇద్దరికి మంత్రులుగా చాన్స్
- కొత్తగా 14 మంది కొత్త మంత్రులను కేబినెట్‌లోకి
- మహిళలకు,దళిత వర్గాలకు ప్రాధాన్యత
- అన్నాడీఎంకే రెబల్స్ కు నిరాశే
- నేడు గవర్నర్ సమక్షంలో కొత్త మంత్రులు ప్రమాణ స్వీకారం



2

**తెలంగాణ చౌరస్తా నేషనల్ బ్యూరో:**
తమిళనాడు రాజకీయాల్లో సంచలనం సృష్టించిన విజయ్ ఇప్పుడు పరిపాలనపై పట్టు బిగించేందుకు సిద్ధమయ్యారు. మే 10న ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన విజయ్, కేవలం 9 మంది మంత్రులతో చిన్న కేబినెట్‌ను ఏర్పాటు చేశారు. గురువారం ఉదయం రాజ్ భవన్‌లో పూర్తి స్థాయిలో మంత్రివర్గాన్ని విస్తరిస్తున్నారు. ప్రస్తుతం ముఖ్యమంత్రి విజయ్ వద్దే హోం, పోలీస్ సహా దాదాపు 20 కీలక శాఖలు ఉన్నాయి. మే 21 ఉదయం గవర్నర్ రాజేంద్ర అర్లేకర్ సమక్షంలో కొత్త మంత్రులు ప్రమాణ స్వీకారం చేయనున్నారు.తాజా సమాచారం ప్రకారం, ఈ విస్తరణలో సుమారు 14 మంది కొత్త మంత్రులను కేబినెట్ లోకి తీసుకునే అవకాశం ఉంది. ఇందులో 12 మంది టీవీకే నుంచి ఉండగా, మిత్రధర్మాన్ని పాటిస్తూ కాంగ్రెస్‌కు 2 మంత్రి పదవులు కేటాయించినట్లు తెలుస్తోంది. ప్రస్తుతం కేబినెట్ లో సీఎం సహా కేవలం

..మిగతా 2 లో

# పెట్టుబడులను ఆకర్షించండి

దీని కోసం ఇన్వెస్ట్ తెలంగాణ ప్రత్యేక వెబ్‌సైట్, లోగో

ఎస్కార్ట్ ఆఫీసర్‌గా గ్రూప్–1 అధికారి

ఫ్యూచర్ సిటీలో ఇన్వెస్ట్ తెలంగాణ కార్యాలయం

తమిళనాడు, గుజరాత్ పారిశ్రామిక విధానాల అధ్యయనం

బుల్లెట్ ట్రైన్ కోసం భూ సేకరణ

డేటా సిటీ కోసం 1,500 ఎకరాలు

ప్రజా ప్రతినిధులు, సివిల్ సర్వీస్ అధికారులు, జర్నలిస్ట్ లకు 500 ఎకరాలు

భారత్ ఫ్యూచర్ సిటీలో భూ కేటాయింపులు, పరిశ్రమల ఏర్పాటుపై సీఎం రేవంత్‌రెడ్డి సమీక్ష




రాష్ట్రంలోకి పెట్టుబడులను ఆకర్షించేందుకు 'ఇన్వెస్ట్ తెలంగాణ' పేరుతో ప్రత్యేక సెల్‌ను ఏర్పాటు చేయాలని సీఎం ఏ రేవంత్‌రెడ్డి అధికారుల్ని ఆదేశించారు. దీని కోసం ప్రత్యేక వెబ్‌సైట్, లోగోను ఆకర్షణీయంగా తీర్చిదిద్దాలని చెప్పారు. ఇన్వెస్ట్ తెలంగాణ ప్రత్యేక కార్యాలయాన్ని భారత్ ఫ్యూచర్ సిటీలో ఏర్పాటు చేసి, దానికి గ్రూప్ 1 అధికారిని ఎస్కార్ట్ ఆఫీసర్‌గా నియమించాలని సూచించారు. తమిళనాడు, గుజరాత్ రాష్ట్రాల్లోని పారిశ్రామిక విధానాన్ని అధ్యయనం చేసి, తెలంగాణ పాలసీని అంతకంటే మెరుగ్గా, ఆకర్షణీయంగా రూపొందించాలని చెప్పారు.

*—తెలంగాణ చౌరస్తా స్టేట్ బ్యూరో*

**తెలంగాణ చౌరస్తా స్టేట్ బ్యూరో:**
భారత్ ఫ్యూచర్ సిటీలో భూ కేటాయింపులు, పరిశ్రమల ఏర్పాటుపై బుధవారం నాడిక్కడి మర్రిచెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి సంస్థలోని బోధి పెవిలియన్‌లో సమీక్షా సమావేశం నిర్వహించారు. పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణా రావు, సీఎం ప్రత్యేక కార్యదర్శి అజిత్ రెడ్డి , తెలంగాణ ఇండస్ట్రియల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్ (టీజీఐఐసీ) వైస్ చైర్మెన్ శశాంక్, పరిశ్రమల శాఖ కమిషనర్ నిఖిల్ చక్రవర్తి, ఐటీ శాఖ జాయింట్ సెక్రటరీ అనుదీప్ దురిశెట్టి ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ జూన్ లో ఫ్యూచర్ సిటీ ఇండస్ట్రియల్ పార్క్ లో

..మిగతా 2 లో





## చివరి వరకు బీజేపీలోనే ఉంటా

- నేను ఏ పార్టీ పెట్టను
- కేటీఆర్ ఫేక్ సోషల్ మీడియా ఫ్యాక్టరీతో నాపై దుష్ప్రచారం
- సొంత కొడుకుని పోలీసుకు అప్పగించా
- విచారణకు సహకరించాలని చెప్పా
- ఏ తండ్రైనా కుమారుడిని పోలీసులకు అప్పగిస్తారా..?
- కేంద్ర మంత్రి బండి సంజయ్

2

## పేదలకు అన్ని రంగాల్లో భరోసా భద్రత

- జూన్ 2న..రెండో విడత ఇందిరమ్మ ఇండ్లు
- మొదటి విడతలో నియోజకవర్గానికి 3500 ఇండ్లు ఇచ్చాం
- అందులో ఏప్రిల్ నాటికి 1.25 వేల ఇండ్ల నిర్మాణం పూర్తి
- జూన్ నాటికి మిగతా 2.30 లక్షల ఇండ్లు పూర్తి
- సీఎం చేతుల మీదుగా రెండో విడత
- కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లాలో ప్రారంభోత్సవం
- బహిరంగ సభ ఏర్పాట్లను మంత్రి పొంగులేటి పరిశీలన



2

**తెలంగాణ చౌరస్తా స్టేట్ బ్యూరో:**
రాష్ట్రంలో రెండో విడత ఇందిరమ్మ ఇండ్ల మంజూరుకు జూన్ రెండో తేదీన అంకురార్పణ జరగనుంది. కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లాలో సీఎం రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా ఇండ్ల పంపిణీకి శ్రీకారం చుట్టనున్నారు. ఈ

..మిగతా 2 లో

## మెడికల్ షాప్‌ల బంద్



2

- రాష్ట్ర వ్యాప్తంగా 25 వేలకు పైగా దుకాణాల మూసివేత
- ఆన్‌లైన్‌లో ఔషధాల డెలివరీని వ్యతిరేకిస్తూ మెడికల్ షాప్‌ల బంద్
- ఒకరోజు బంద్‌కు పిలుపునిచ్చిన ఆర్గనైజేషన్ ఆఫ్ కెమిస్ట్స్, డ్రగ్గిస్ట్స్
- దేశవ్యాప్తంగా మూతపడిన 12 లక్షలకు పైగా మెడికల్ దుకాణాలు
- ఒక్క హైదరాబాద్‌లోనే 12 వేలకు పైగా బంద్

## సరికొత్త శిఖరాలకు భారత్– ఇటలీ ద్వైపాక్షిక సంబంధాలు



2

- సాంకేతిక రంగంలో పరస్పర సహకారం
- ఇరు దేశాల మధ్య పురాతన సాంస్కృతిక సంబంధాలు
- ఇప్పుడు విన్-విన్ పద్ధతిలో ఇరుదేశాలు కొనసాగుతున్నాయి
- వాణిజ్యం,రక్షణ, క్లీన్ ఎనర్జీ, సాంకేతిక రంగాలపై ప్రత్యేకంగా చర్చల
- అనంతరం ప్రధాని నరేంద్ర మోదీ



## హైదరాబాద్ మెట్రో రైలు విస్తరణ

- చెరో 50 శాతం చొప్పన ముందుకెళ్లేందుకు కేంద్రం సిద్ధం
- హైదరాబాద్ ప్రాజెక్టులపై కేంద్రమంత్రులు సమీక్ష
- హైదరాబాద్ మెట్రో విస్తరణ, మూసీ ప్రక్షాళనపై చర్చ
- మెట్రో విస్తరణకు సూత్రప్రాయ అంగీకారం
- కేంద్ర, రాష్ట్రాలు సగం సగం ఖర్చుతో ముందుకెళ్లేందుకు సిద్ధం
- కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి

2

# అత్యాచార నిందితుడికి ఘన స్వాగతం

**తెలంగాణ చౌరస్తా నేషనల్ బ్యూరో:**

బీజేపీ పాలిత రాష్ట్రాల్లో మహిళలకు రక్షణ లేకుండాపోతుందని మహిళా సంఘాలు ఆరోపిస్తున్నాయి. నాడు గుజరాత్ లో బిల్కిస్ బానుపై సామూహిక లైంగికదాడికి పాల్పడిన నిందితులు బెయిల్ పై విడుదల కాగా.. వారిని వీరోచిత పోరాటం చేసిన యోధుల్లా కాషాయ మూకలు కీర్తిస్తున్న తీరు వివాదస్పదమవుతోంది. తాజాగా యూపీలో కూడా అలాంటి ఘటనే జరిగింది. లైంగికదాడి కేసులో 9 నెలల తర్వాత బెయిల్ పై విడుదలైన నిందితుడికి ఘన స్వాగతం పలకడంపై తీవ్ర విమర్శలు వస్తున్నాయి. జైలు గేటు నుంచి బయటకు అడుగు పెట్టగానే నిందితుడి మెడలో పూల దండలు వేసి, కరచాలనం చేస్తూ, కాళ్లకు మొక్కుతూ అతని అనుచరులు నానా హడావిడి చేశారు. అనంతరం భుజాలపై మోస్తూ ఊరేగింపు తీశారు. ఈ ఘటన దిల్లీ సమీప గాజియాబాద్‌లో ఈ నెల 17న చోటుచేసుకుంది. ఈ దృశ్యాలు సామాజిక మాధ్యమంలో వ్యాప్తిలోకి రాగా పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. నిందితుడు సుశీల్ ప్రజాపతి.. హిందూ యువ వాహిని మాజీ సభ్యుడు. న్యాయవాదిని పరిచయం చేస్తానంటూ ఒక న్యాయవిద్యార్థినిని ఫ్లాట్ కు తీసుకెళ్లిన సుశీల్ ప్రజాపతి అనంతరం ఆమెపై లైంగికదాడికి పాల్పడ్డాడు. కేసు నమోదు కావడంతో పోలీసులు అరెస్టు చేసి జైలుకు తరలించారు.

# కేంద్ర మంత్రి నిర్మలమ్మకు భట్టి రిక్వెస్ట్

**తెలంగాణ చౌరస్తా స్టేట్ బ్యూరో:**



దిల్లీలో పర్యటిస్తున్న ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌తో సమావేశమయ్యారు. రాష్ట్రానికి సంబంధించిన వివిధ అంశాలపై కేంద్రమంత్రితో చర్చించారు. ఆపై ఎస్ఏఎస్సీఐ కింద రాష్ట్రానికి అదనంగా రూ.5 వేల కోట్లు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. మరోవైపు రాష్ట్రంలోని విద్య, వైద్యం, గ్రామీణ మౌలిక వసతులను వివరించిన భట్టి విక్రమార్క, మానవ వనరుల అభివృద్ధికి రాష్ట్రం చేపట్టిన కార్యక్రమాల వివరాలను తెలిపారు. యంగ్ ఇండియా స్కూల్స్ గురించి కేంద్రమంత్రికి వివరించిన డిప్యూటీ సీఎం, ఆర్థిక వ్యవహారాల శాఖ ఆమోదిత ప్రాజెక్టులకు ఎఫ్ఆర్బీఎం పరిమితి మినహాయింపు కోరారు.కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌తో భేటీ అయిన డిప్యూటీ సీఎం, తెలంగాణ అభివృద్ధి, విద్యా రంగంలో భారీ పెట్టుబడులు, మూలధన వ్యయాలకు అదనపు ఆర్థిక సహాయం కోరారు. ఎస్ఏఎస్సీఐ కింద రూ.5,000 కోట్ల ప్రత్యేక సహాయం, విద్యారంగ పెట్టుబడులకు ఎఫ్ఆర్బీఎం మినహాయింపు ఇవ్వాలని విన్నవించారు. సాస్కీ కింద తెలంగాణకు అదనంగా రూ.5,000 కోట్ల ప్రత్యేక ఆర్థిక సహాయాన్ని మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఈ పథకం ద్వారా రాష్ట్రాలకు 50 ఏళ్ల వడ్డీ లేని రుణాల రూపంలో అందిస్తున్న సహకారానికి తెలంగాణ ప్రభుత్వం తరపున ఆయన కృతజ్ఞతలు తెలియజేశారు. 2025-26 ఆర్థిక సంవత్సరంలో రాష్ట్రానికి ఇప్పటికే రూ.4,208 కోట్లు మంజూరైన విషయాన్ని ప్రస్తావించారు. రాష్ట్రంలో కొనసాగుతున్న అభివృద్ధి కార్యక్రమాలు, సంక్షేమ పథకాలకు మరింత ఆర్థిక మద్దతు అవసరమని కేంద్ర మంత్రికి వివరించారు. నూతనంగా ఏర్పడిన రాష్ట్రాల్లో తెలంగాణ వేగంగా అభివృద్ధి చెందుతుందన్నారు. అయినప్పటికీ 2014 నుంచి 2023 మధ్య ప్రత్యేక ప్రయోజన సంస్థలు (ఎస్పీవీ) ద్వారా తీసుకున్న అప్పుల భారం, వాటి చెల్లింపుల కారణంగా రాష్ట్ర ఆర్థిక వ్యవస్థపై ఒత్తిడి పెరిగిందని ఉప ముఖ్యమంత్రి వ్యాఖ్యానించారు. విద్య, వైద్యం, గ్రామీణ మౌలిక వసతులు, మానవ వనరుల అభివృద్ధి రంగాల్లో తెలంగాణ ప్రభుత్వం భారీ స్థాయిలో పెట్టుబడులు కొనసాగిస్తోందని ప్రస్తావించారు. యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ ద్వారా రాష్ట్రంలోని విద్యార్థులకు ప్రపంచ స్థాయి విద్య అందించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉన్నట్లు నిర్మలా సీతారామన్కి తెలిపారు. జిల్లాల వారీగా కొత్త మెడికల్ కళాశాలలు, గ్రామీణ ఆరోగ్య సేవల విస్తరణ, విద్యా మౌలిక వసతుల బలోపేతం వంటి కార్యక్రమాలు సామాజిక సమానత్వంతో కూడిన సుస్థిర అభివృద్ధికి దోహదపడతాయని కేంద్రమంత్రికి వివరించారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగ రూపాంతరానికి మొత్తం రూ.30,000 కోట్ల పెట్టుబడుల ప్రణాళిక రూపొందించిందని ప్రస్తావించారు. ఇందులో రూ.21,000 కోట్లతో 105 యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ క్యాంపస్‌ల నిర్మాణం, మరో రూ.9,000 కోట్లతో ప్రభుత్వ జూనియర్ కళాశాలలు, డిగ్రీ కళాశాలలు, సాంకేతిక విద్యాసంస్థలు, డిజిటల్ మౌలిక వసతుల అభివృద్ధి చేపడుతున్నట్లు ఆయన వివరించారు.

# నేడు తమిళనాడు కేబినెట్ విస్తరణ

▶▶ మొదటిపేజీ తరువాయి

10 మంది మాత్రమే ఉన్నారు. రేపటి విస్తరణతో ఈ సంఖ్య 24కు చేరనుంది. కాంగ్రెస్ తరపున ఇద్దరు మంత్రులుగా ప్రమాణం చేస్తున్నారని కేసీ వేణుగోపాల్ ప్రకటించారు.అన్నాడీఎంకే నుంచి తిరుగుబాటు చేసిన ఎమ్మెల్యేలకు మంత్రి పదవులు దక్కుతాయని గతంలో ప్రచారం జరిగినప్పటికీ, విజయ్ వారిని పూర్తిగా పక్కన పెట్టారు. కాంగ్రెస్, వీసీకే, లెఫ్ట్ పార్టీల వంటి మిత్రపక్షాల నుంచి వచ్చిన ఒత్తిడితో, కేవలం నమ్మకస్తులకు, సెక్యులర్ కూటమిలోని మిత్రులకే చోటు కల్పించాలని విజయ్ నిర్ణయించుకున్నారు. సామాజిక సమీకరణాలను బట్టి మహిళలకు, దళిత వర్గాలకు కూడా ఈ విడతలో ప్రాధాన్యత లభించనుంది. మంత్రివర్గం అసంపూర్తిగా ఉంటే పాలన కష్టమవుతుందని భావించి, విజయ్ ఈ దిశగా వేగంగా అడుగులు వేశారు. కేరళ పర్యటనలో ఉన్న గవర్నర్ అర్లేకర్ చెన్నైకి చేరుకున్నారు. రాజ్‌భవన్‌లో సరళంగా జరిగే ఈ కార్యక్రమంలో కొత్త మంత్రులు బాధ్యతలు స్వీకరిస్తారు.

3టీవీకేలో కీలక పాత్ర పోషిస్తున్న బుస్సీ ఆనంద్, ఆధవ్ అర్జున వంటి వారు ఇప్పటికే మంత్రులుగా ఉండగా, మాజీ అన్నాడీఎంకే సీనియర్లు గతంలోనే టీవీకేలో చేరిన వారు మరియు , యువ నేతలకు అవకాశం దక్కే ఛాన్స్ ఉంది

# చివరి వరకు బీజేపీలోనే ఉంటా

**తెలంగాణ చౌరస్తా స్టేట్ బ్యూరో:**

కొంతమంది స్వార్థ రాజకీయాలు చేస్తున్నారని కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ మండిపడ్డారు. తాను కొత్త పార్టీ పెడతానని తప్పుడు ప్రచారం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. పార్టీలో చిత్తశుద్ధితో పని చేసే కార్యకర్తను తానని, కేసీఆర్‌ను గద్దె దించినందున తమపై కోపం ఉంటుందని అన్నారు. బీఆర్ఎస్ నేత కేటీఆర్ ఫేక్ సోషల్ మీడియా ఫ్యాక్టరీ నడుపుతున్నారని విమర్శించారు.భారతీయ జనతా పార్టీలో ప్రతి ఒక్కరూ సుశిక్షితులైన కార్యకర్తలేనని కేంద్రమంత్రి బండి సంజయ్ అన్నారు. కమిట్‌మెంట్‌తో పని చేసే పార్టీ కార్యకర్తను తానని, చివరి కోరిక ఏంటని అడిగితే చనిపోయిన తర్వాత బీజేపీ జెండా కప్పాలని కోరుకుంటానని చెప్పారు. తాను ఎలాంటి వాడినో కార్యకర్తలకు తెలుసన్నారు. తన కుమారుడు భగీరథ్ అరెస్ట్ తర్వాత తొలిసారి పార్టీ కార్యాలయానికి వచ్చిన బండి సంజయ్, ఈసందర్భంగా మీడియాతో మాట్లాడారు.కేంద్రమంత్రి పదవి నుంచి బర్తరఫ్ చేయాలని ఇతర పార్టీల నేతలు డిమాండ్ చేస్తున్నారని ఓ మీడియా ప్రతినిధి బండి సంజయ్ను ప్రశ్నించగా, ఆయన స్పందించారు. మాజీ సీఎం కేసీఆర్ (బీఆర్ఎస్ పార్టీ)కి లోక్‌సభలో ఒక్క ఎంపీ లేరని గుర్తు చేశారు. ఫామ్‌హౌస్‌లో కూర్చుని ఏదైనా చెబుతారని ఎద్దేవా చేశారు.ఆయన అవినీతి సామ్రాజ్యాన్ని కూకటివేళ్లతో కూల్చింది, ఆ కుటుంబ పాలనను అంతం చేసింది తామేనని వెల్లడించారు. అందుకే తమపై అసత్య ఆరోపణలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కేటీఆర్ ఫేక్ సోషల్ మీడియా ఫ్యాక్టరీ నడుపుతున్నారని, కన్న కుమారుడిని పోలీసులకు స్వయంగా అప్పగించిన సందర్భం ఎక్కడైనా ఉందా? అని ప్రశ్నించారు. విచారణకు సహకరించాలనే తన కుమారుడిని అప్పగించానని, కేసు విచారణలో పోలీసులకు సహకరించాలని తానే చెప్పానని తెలిపారు.

**అరెస్టు చేశారా? లేక లొంగిపోయారా? :** బండి భగీరథ్ను పట్టుకోవడానికి 5 స్పెషల్ టీమ్స్ ను ఏర్పాటు చేశారు. హైదరాబాద్‌లోని బండిసంజయ్ నివాసానికి సైతం వెళ్లి తనిఖీ చేశారు. ఈ నేపథ్యంలో తన కుమారుడిని తానే పోలీసులకు అప్పగించినట్లు మే 16న రాత్రి 8 గంటల సమయంలో బండి సంజయ్ సామాజిక మాధ్యమం ఎక్స్లో ప్రకటించారు. ఆ తర్వాత కొద్దిసేపటికే భగీరథ్‌ను అరెస్టు చేశామంటూ సైబరాబాద్ పోలీసులు తెలిపారు. పోలీస్ అకాడమీ (అప్పా జంక్షన్) సమీపంలో అదుపులోకి తీసుకుని నేరుగా పేట్ బషీరాబాద్ పోలీస్‌స్టేషన్‌కు తరలించినట్లు వెల్లడించారు.



# బాలింతలకు పోషకాహారాలు పంపిణీ

**కాల్వ శ్రీరాంపూర్, తెలంగాణ చౌరస్తా:**

కాల్వ శ్రీరాంపూర్ మండలంలోని మీర్జంపేట గ్రామంలోని అంగన్వాడీ సెంటర్లో గ్రామ సర్పంచ్ పోశాల శైలజ సదానందం గౌడ్ బాలింతలకు బుధవారం రోజున పోషకాహారాలు పంపిణి చేశారు.ఈ కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్ కలువల సునీత,మామిడి మహేశ్వరీ,ఆయమ్మ సిరికొండ సృజన, బాలింతలు, తదితరులు పాల్గొన్నారు.

# పెట్టుబడులను ఆకర్షించండి

▶▶ మొదటిపేజీ తరువాయి



పరిశ్రమల ఏర్పాటు కు శంకుస్థాపన జరిగేలా చూడాలని చెప్పారు.

భూ కేటాయింపు జరిగిన వెంటనే పరిశ్రమలు నిర్మాణం మొదలు పెట్టేలా నిబంధన విధించాలని సూచించారు. నెట్ జీరో సిటీ తరహా లోనే డిజైన్లు ఉండాలనీ, అంతర్జాతీయ స్థాయిలో మౌలిక వసతుల కల్పన ఉండాలని చెప్పారు. దీనిలో ఎలాంటి రాజీ పడొద్దని అధికారుల్ని హెచ్చరించారు. దీనికోసం అవసరమైతే అంతర్జాతీయ స్థాయి నగరాలను అధ్యయనం చేయాలన్నారు. ఫ్యూచర్ సిటీలోకి అంతర్జాతీయ స్థాయి సంస్థలను తీసుకురావాలనీ, దీనికోసం పరిశ్రమల శాఖ ఉన్నతాధికారులు ప్రత్యేక చొరవ చూపాలని చెప్పారు. అయితే ఫ్యూచర్‌సిటీలో తొలుత ట్రంక్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ అభివృద్ధి చేయాలనీ, ఆ తర్వాతే భూ కేటాయింపులు చేయాలని సూచించారు. 1,500 ఎకరాల్లో డేటా సిటీ ఏర్పాటు చేయాలనీ, వాటి నీటి అవసరాలకోసం సివరేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్లను (ఎస్టీపీ)లు వినియోగించుకోవాలని చెప్పారు. కేంద్రం ప్రకటించిన హెల్త్ క్లస్టర్ ను ఫ్యూచర్ సిటీ కి వచ్చేలా చర్య లు తీసుకోవాలనీ, దీనికోసం అవసరమైతే ప్రధాని మోడీని కలిసి హెల్త్ క్లస్టర్ కోసం ప్రత్యేక

విజ్ఞప్తి చేద్దామని అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఫ్యూచర్ సిటీలోనే ప్రజా ప్రతినిధులు, సివిల్ సర్వీస్ అధికారులు, జర్నలిస్టులకు 500 ఎకరాలు కేటాయించాలని ఆదేశించారు. అలాగే గ్లోబల్ కేపబిలిటీ సెంటర్లు (జీసీసీ), డేటా సెంటర్ల కోసం కరీంనగర్, వరంగల్, విజయవాడ రోడ్ల సమీపంలోని ప్రభుత్వ భూముల్ని గుర్తించాలని ఆదేశించారు. ఈ కేంద్రాలు సాధ్యమైనంతగా ద్వితీయ శ్రేణి నగరాలల్లో ఏర్పాటయ్యేలా విధాన రూపకల్పన చేయాలని చెప్పారు. అలాగే అన్ని ప్రభుత్వ కార్యాలయాలు మూడు నెలల్లో టీ ఫైబర్ కు కనెక్ట్ కావాల్సిందేననీ, దీనిలో ఎవరికీ ఎలాంటి మినహాయింపులు ఉండబోవని స్పష్టంచేశారు. హైదరాబాద్ పురోగతిని మార్చే బుల్లెట్ ట్రైన్ ప్రాజెక్ట్ కోసం భూ సేకరణ ప్రారంభించాలని ఆదేశించారు. అంతకుముందు పరిశ్రమల శాఖ అధికారులు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా రాష్టంలో పారిశ్రామిక పురోగతి, ఫ్యూచర్ సిటీ ప్రాధాన్యతలను వివరించారు.



# పేదలకు అన్ని రంగాల్లో భరోసా భద్రత

▶▶ మొదటిపేజీ తరువాయి

మేరకు గృహ నిర్మాణ, రెవెన్యూ, సమాచార, పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి బుధవారం ఆసిఫాబాద్ జిల్లాకు వచ్చి సీఎం సభ స్థలాన్ని పరిశీలించారు. ఈయనతో పాటు జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి, అబ్కారీ, పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు కూడా వచ్చారు. రెండో తేదీన కాగజ్‌నగర్ క్రాస్ రోడ్డు వద్ద సీఎం బహిరంగ సభ నిర్వహించనున్నారు. దీనికి ముందు కెరమెరి మండలం కొరారి గ్రామంలో మొదటి విడతగా మంజూరైన 30 ఇందిరమ్మ ఇండ్లను ప్రారంభించనున్నారు. అనంతరం బహిరంసభలో సీఎం పాల్గొంటారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి మాట్లాడుతూ.. పేదవానికి అన్ని రంగాల్లో భరోసా, భద్రతనిచ్చే ప్రజాప్రభుత్వం తమదని చెప్పారు. మొదటి విడతలో ప్రతి నియోజకవర్గానికీ 3,500 ఇండ్లు మంజూరు చేశామని, రాష్ట్రవ్యాప్తంగా ఏప్రిల్ నాటికి 1.25 వేల ఇండ్ల నిర్మాణం పూర్తయ్యిందని వివరించారు. జూన్ నాటికి 2.30 లక్షల ఇండ్ల నిర్మాణం పూర్తి కానుందని తెలిపారు. అర్హులైన పేదలందరికీ ఇండ్లు ఇస్తామని, ప్రతి ఏడాదీ దశల వారీగా వీటిని అందిస్తామని, ఈ విషయంలో పేదలు ఆందోళనకు గురికావద్దని చెప్పారు. ఈ పర్యటనలో ఆదిలాబాద్ ఎమ్మెల్సీ దండె విఠల్, మంచిర్యాల, బెల్లంపల్లి ఎమ్మెల్యేలు కె.ప్రేంసాగర్‌రావు, గడ్డం వినోద్, జిల్లా కలెక్టర్ కె.హరిత పాల్గొన్నారు.




# మెడికల్ షాప్‌ల బంద్

**తెలంగాణ చౌరస్తా స్టేట్ బ్యూరో:**

దేశవ్యాప్తంగా మెడికల్ దుకాణాల బంద్ కొనసాగుతోంది. ఆన్‌లైన్‌లో ఔషధాల డెలివరీని వ్యతిరేకిస్తూ మెడికల్ షాప్‌ల బంద్కు ఆర్గనైజేషన్ ఆఫ్ కెమిస్ట్స్, డ్రగ్గిస్ట్స్ పిలుపునిచ్చింది. దీంతో దేశవ్యాప్తంగా 12 లక్షలకు పైగా మెడికల్ దుకాణాలను మూసివేశారు. తెలంగాణలో 25 వేలకు పైగా ఔషధ దుకాణాలను మూసివేయగా, ఒక్క హైదరాబాద్‌లోనే 12 వేలకు పైగా బంద్ ను పాటిస్తున్నాయి. ఆస్పత్రులకు అనుబంధంగా ఉన్న మెడికల్ షాపులకు మాత్రం మినహాయింపు ఉంది.

ప్రజలకు అత్యవసర మందులను ఇబ్బంది లేకుండా ప్రభుత్వ ఆస్పత్రుల్లో 24 గంటలు అందుబాటులో ఉంచాలని వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనరసింహ అధికారులను ఆదేశించారు. ప్రైమరీ హెల్త్ సెంటర్, బస్తీ దవాఖానాలు సహా అన్ని ప్రభుత్వ ఆసుపత్రుల్లో బుధవారం 24 గంటల పాటు ఫార్మసీలు తెరిచి ఉంచాలని చెప్పారు. ఫార్మసిస్టులు కూడా అందుబాటులో ఉండాలని, డ్రగ్ కంట్రోల్ అథారిటీ వారు ప్రజలకు ఎక్కడా ఇబ్బందులు కలగకుండా చూసుకోవాలని మంగళవారం విడుదల చేసిన ప్రకటనలో తెలిపారు. మరో వైపు డీసీఏ కూడా ప్రజలకు మెడికల్ షాపుల బంద్పై పలు సూచనలు చేసింది.

మెడికల్ షాపుల బంద్ దృష్ట్యా ప్రజలకు డీసీఏ (డ్రగ్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్) పలు సూచనలు చేసింది. ఆస్పత్రులకు అనుబంధంగా ఉన్న షాపులు తెరిచే ఉంటాయని, అత్యవసర మందుల కోసం డ్రగ్ కంట్రోల్ అధికారిని సంప్రదించాలని తెలిపింది. ప్రజలకు ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చింది. అధికారుల నంబర్లు, చిరునామా డీసీఏ వెబ్‌సైట్‌లో ఉంటాయని వెల్లడించిన డీసీఏ, సాయం కోసం డీసీఏ టోల్‌ఫ్రీ నంబర్ 1800 599 6969 సంప్రదించాలని తెలిపింది.

కెమిస్ట్ అండ్ డ్రగ్గిస్ట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మహబూబాబాద్ జిల్లా వ్యాప్తంగా మెడికల్ షాపులను మూసివేసి దుకాణదారులు పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. ఆన్లైన్లో ఔషధాల విక్రయాలను నిలిపివేయాలని నినాదాలు చేశారు. దీంతో జిల్లాలోని 475 మెడికల్ షాప్స్ మూతపడ్డాయి. ఈ సందర్భంగా సీపీఐ కెమిస్ట్ అండ్ డ్రగ్గిస్ట్ జిల్లా అధ్యక్షుడు సంపత్ రావు మాట్లాడుతూ అన్ని రకాల అనుమతులు తీసుకొని, లైసెన్సుదారుల వద్ద మెడిసిన్స్ కొనుగోలు చేసి అమ్ముకుంటూ జీవనం సాగిస్తున్నామని తెలిపారు. ఆన్లైన్లో ఔషధాల విక్రయాలతో చిన్న దుకాణాలలో సేల్స్ తగ్గి మూతపడుతున్నాయని, కార్పొరేట్ సంస్థల డిస్కౌంట్ మాయాజాలంతో జీవనోపాధి కోల్పోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. తమ దుకాణాల్లో డాక్టర్ ప్రిస్క్రిప్షన్ ఉంటేనే ఔషదాలు విక్రయించాలని ఆంక్షలు విధిస్తున్నారని, ఆన్లైన్లో మాత్రం ఎలాంటి ప్రిస్క్రిప్షన్ లేకున్నా ఔషధాలను ఎలా ఇంటికి డెలివరీ చేస్తారని, మత్తు మందులను కూడా ఎలా విక్రయిస్తున్నారని ప్రశ్నించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వెంటనే ఆన్లైన్లో ఔషధాల విక్రయాలను నిలిపివేయాలని కోరారు. ఈ నిరసన కార్యక్రమంలో జిల్లాలోని ఔషధ దుకాణదారులు పాల్గొన్నారు.

# సరికొత్త శిఖరాలకు భారత్ ఇటలీ ద్వైపాక్షిక సంబంధాలు

**తెలంగాణ చౌరస్తా నేషనల్ బ్యూరో:**

భారత్‌ఇటలీ ద్వైపాక్షిక సంబంధాలు సరికొత్త శిఖరాలకు చేరాయని ప్రధాని నరేంద్ర మోదీ పేర్కొన్నారు. ఇటలీ ప్రధాని జార్జియా మెలోనీతో జరిగిన విస్తృత స్థాయి చర్చల అనంతరం ఏర్పాటు చేసిన సంయుక్త మీడియా సమావేశంలో ఆయన ఈ కీలక వ్యాఖ్యలు చేశారు. 'భారత్‌ఇటలీ సంయుక్త వ్యూహాత్మక కార్యాచరణ ప్రణాళిక 202529' గురించి మోదీ ప్రత్యేకంగా ప్రస్తావించారు. ఇది ఇరుదేశాల ద్వైపాక్షిక సంబంధాలకు ఒక ఆచరణాత్మక, భవిష్యత్ ఆధారిత నిర్మాణాన్ని అందిస్తుందని పేర్కొన్నారు. ఇరుదేశాల నాయకుల మధ్య పెరుగుతున్న నిరంతర చర్చలు, సమావేశాలు ఇరుపక్షాల మధ్య బలపడుతున్న సహకారానికి, పరస్పర నమ్మకానికి నిదర్శనమని మోదీ అన్నారు.

"సాంకేతికత, ఆవిష్కరణలు మా భాగస్వామ్యానికి చోదక శక్తులు. కృత్రిమ మేధ (ఏఐ), క్వాంటం, పౌర అణు ఇంధనం (సివిల్ న్యూక్లియర్ ఎనర్జీ), అంతరిక్ష రంగాల్లో మా భాగస్వామ్యానికి అపరిమితమైన అవకాశాలు ఉన్నాయి. ఇరుదేశాల్లోని స్టార్టప్లు, పరిశోధనా కేంద్రాలు, వ్యాపారాలను అనుసంధానించడానికి మేము భారత్‌ఇటలీ ఇన్నోవేషన్ సెంటర్ ఏర్పాటుపై పనిచేస్తున్నాం"అని ప్రధాని మోదీ పేర్కొన్నారు. గడచిన మూడున్నర ఏళ్లలో తనకు, ఇటలీ ప్రధాని మెలోనీతో పలుమార్లు సమావేశం అయ్యే అవకాశం వచ్చిందని మోదీ పేర్కొన్నారు. "ఇది భారత్‌ఇటలీ మధ్య ఉన్న సన్నిహిత సహకారానికి, సయోధ్యకు ప్రతిబింబం. ఆమె నాయకత్వంలో మన ఇరుదేశాల సంబంధాలు సరికొత్త వేగాన్ని, నూతన దిశను, ఆత్మవిశ్వాసాన్ని సంతరించుకున్నాయి. మా సంబంధాలను మరింత ఉన్నత స్థాయికి తీసుకెళ్తూ, ఈ ప్రత్యేక వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని ప్రకటించడం నాకు ఎంతో ఆనందాన్ని ఇస్తోంది" అని మోదీ అన్నారు.భారత్‌ఇటలీ మధ్య ఉన్న నాగరికతా సంబంధాలను కూడా మోదీ హైలెట్ చేశారు. ఇరుదేశాల మధ్య ఉన్న సంబంధాలు కేవలం ఇప్పటివి కావని అన్నారు. ఇటలీ రాజధాని రోమ్ నగరానికి, తన పార్లమెంటరీ నియోజకవర్గమైన వారణాశి (కాశీ)కి మధ్య ఉన్న చారిత్రక అనుబంధాన్ని ప్రధాని మోదీ గుర్తుచేశారు."నాకు, నా ప్రతినిధి బృందానికి ఘన స్వాగతం పలికినందుకు నేను ప్రధాని మెలోనీకి ధన్యవాదాలు తెలియజేస్తున్నాను. ప్రపంచంలో రోమ్ నగరాన్ని శాశ్వత నగరం అని పిలుస్తారు. భారతదేశంలో నా లోక్‌సభ నియోజకవర్గమైన కాశీ కూడా శాశ్వత నగరమే. ఈ రెండు గొప్ప నాగరికతలు కలిసినప్పుడు, చర్చలు కేవలం ఒక ఎజెండాకే పరిమితం కావు. అందులో లోతైన చరిత్ర, భవిష్యత్తు వీక్షణం, నిరాండర స్నేహం స్పష్టంగా కనిపిస్తాయి" అని మోదీ పేర్కొన్నారు.ప్రధాని తన ఐదు దేశాల పర్యటనలో భాగంగా నార్వే, స్వీడన్, నెదర్లాండ్స్, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యూఏఈ)ల్లో పర్యటించారు. చివరిగా మంగళవారం నాడు ఇటలీ పర్యటనకు వెళ్లారు. ఇటలీ చేరుకున్న ప్రధాని మోదీకి రోమ్‌లో సైనిక వందనం చేస్తూ ఘన స్వాగతం పలికారు. రోమ్ చేరుకున్న వెంటనే ఆయన ఇటలీ ప్రధాని జార్జియా మెలోనితో ప్రత్యేక విందులో పాల్గొన్నారు. అనంతరం ఇరువురు నేతలు రోమ్‌లోని ప్రఖ్యాత చారిత్రక కట్టడం 'కొలోసియం'ను సందర్శించారు. తర్వాత ఇరుదేశాల నేతలు సమావేశమై వాణిజ్యం, రక్షణ, క్లీన్ ఎనర్జీ, సాంకేతిక రంగాలపై ప్రత్యేకంగా చర్చలు జరిపారు.





# హైదరాబాద్ మెట్రో రైలు విస్తరణ

**తెలంగాణ చౌరస్తా స్టేట్ బ్యూరో:**

హైదరాబాద్ మెట్రో రైల్ విస్తరణకు ముందడుగు పడింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చెరో 50 శాతం చొప్పున ఖర్చు చేసే ప్రాతిపదికన ముందుకెళ్లేందుకు సిద్ధంగా ఉన్నామని కేంద్ర పట్టణాభివృద్ధి శాఖ మంత్రి మనోహర్ లాల్ ఖట్టర్ ప్రకటించారు. మూసీ ప్రక్షాళనకు కేంద్రం సహకరిస్తుందని, అమృత్ 2.O పథకం కింద రూ.3 వేల 975 కోట్లతో 39 ఎస్టీపీలు మంజూరు చేసినట్లు వెల్లడించారు. దిల్లీలో జరిగిన సమావేశంలో హైదరాబాద్‌లో ప్రజా రవాణా, పారిశుద్ధ్యం, మౌలిక వసతుల ప్రాజెక్టులపై సమీక్షించినట్లు కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి తెలిపారు.హైదరాబాద్ మెట్రో రైల్ విస్తరణ, పారిశుద్ధ్యం, మౌలిక సదుపాయాలపై దిల్లీలో కేంద్ర మంత్రులు మనోహర్‌లాల్ ఖట్టర్, కిషన్‌రెడ్డి సమీక్షించారు. సమావేశ వివరాలను కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి సామాజిక మాధ్యమం ఎక్స్ ద్వారా వెల్లడించారు. హైదరాబాద్ మెట్రో రెండో దశ ప్రాజెక్టుపై సమావేశంలో చర్చించినట్లు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ఎల్ అండ్ టీ సంస్థ నుంచి మెట్రో రైల్‌ను ఇటీవలే టేకోవర్ చేసుకుంది. ఈ నేపథ్యంలో రెండో దశ పనులకు సంబంధించిన డీటైల్డ్ ప్రాజెక్ట్ రిపోర్ట్ (డీపీఆర్), ఇతర సాంకేతిక వివరాలు అందిన తర్వాత కేంద్ర ప్రభుత్వం సమగ్రంగా పరిశీలించి తదుపరి నిర్ణయం తీసుకుంటుందని కేంద్ర పట్టణాభివృద్ధి శాఖ మంత్రి మనోహర్‌లాల్ ఖట్టర్ తెలిపారు.

హైదరాబాద్ మెట్రో రెండో దశ ప్రాజెక్టు చేపట్టేందుకు కేంద్ర ప్రభుత్వానికి ఎటువంటి ఇబ్బంది లేదని స్పష్టం చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చెరో 50 శాతం చొప్పున ఖర్చు చేసే ప్రాతిపదికన ముందుకెళ్లేందుకు సిద్ధంగా ఉన్నామని ప్రకటించారు. రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే 162 కిలోమీటర్ల మేర మెట్రో రెండో దశ విస్తరణకు ప్రతిపాదనలు సమర్పించిందని, సానుకూలంగా పరిశీలించి తదుపరి చర్యలు తీసుకుంటామని మనోహర్‌లాల్ ఖట్టర్ వెల్లడించారు. హైదరాబాద్‌లో మూసీ ప్రక్షాళనపైనా సమావేశంలో చర్చించారు. అమృత్ 2.O పథకంలో భాగంగా మూసీ నదిలో కలుస్తున్న మురుగు నీటిని శుద్ధి చేసేందుకు మొత్తం 39 సీవేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్లను (ఎస్టీపీ)లను మంజూరు చేశామని, ఈ ప్రాజెక్టు కోసం రూ.3 వేల 975 కోట్లు ఖర్చు చేస్తున్నట్లు ఖట్టర్ చెప్పారు. 39 ఎస్టీపీల ద్వారా రోజుకు 972 మిలియన్ లీటర్ల మురుగు నీటిని శుద్ధి చేసే సామర్థ్యం వస్తుందన్నారు. శుద్ధి చేయని మురికి నీరు నేరుగా మూసీ నదిలో కలవకుండా ఎస్టీపీలతో నిరోధించవచ్చన్నారు. మూసీ నది పరిరక్షణతో పాటు నగర పారిశుద్ధ్య మెరుగుదలకు ఇది ఎంతో దోహదం చేస్తుందని ఖట్టర్ తెలిపారు. హైదరాబాద్ మహానగర అభివృద్ధికి, ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు కల్పించేందుకు కేంద్ర ప్రభుత్వం పూర్తి స్థాయిలో సహకారం అందిస్తుందని అన్నారు. హైదరాబాద్ ప్రజల తరపున కేంద్ర పట్టణాభివృద్ధి శాఖ మంత్రి ఖట్టర్‌కు కృతజ్ఞతలు తెలిపినట్లు కిషన్‌రెడ్డి పేర్కొన్నారు.



# అంగరంగ వైభవంగా గంగమ్మ తల్లి జాతర

**తొర్రూరు-తెలంగాణ చౌరస్తా:**

గుర్తూరు గ్రామంలో గంగమ్మ తల్లి జాతర వేడుకలు ఆద్యంతం భక్తిశ్రద్ధలతో అంగరంగ వైభవంగా నిర్వహించారు.తొర్రూరు మండలం పరిధిలోని ఈ గ్రామంలో గంగపుత్రులు సంప్రదాయబద్ధంగా ఒక్కచోట చేరి జాతరను ఘనంగా నిర్వహించారు. జాతరలో భాగంగా తెల్లటి దుస్తులు ధరించిన భక్తులు జలబిందెలను మోసుకుంటూ డప్పు చప్పుళ్ల నడుమ శిగాలు వేస్తూ ఆటపాటలతో ఊరేగింపుగా గంగమ్మ ఆలయానికి చేరుకున్నారు.మహిళలు మంగళహారతులతో భక్తి భావాన్ని చాటగా,యువత నృత్యాలతో ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు.అనంతరం గంగమ్మ తల్లికి జలాభిషేకం నిర్వహించి ప్రత్యేక పూజలు చేశారు.ఈ సందర్భంగా గంగపుత్ర సంఘ నాయకులు మాట్లాడుతూ... గ్రామ దేవత అయిన గంగమ్మ తల్లికి ప్రతి సంవత్సరం జల్లాభిషేకం నిర్వహించడం ఆనవాయితీ అని తెలిపారు.గ్రామంలో కరువు, కాటకాలు లేకుండా పాడి పంటలు సమృద్ధిగా పండాలని,ప్రజలు సుఖశాంతులతో ఉండాలని అమ్మవారిని ప్రార్థించినట్లు పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో మత్స్య సొసైటీ అధ్యక్షుడు పిల్లి నాగరాజు,గంగపుత్ర సంఘ అధ్యక్షుడు పిల్లి వెంకన్న, సింగారం చందర్‌తో పాటు సంఘ నాయకులు, కార్యకర్తలు,యువత, మహిళలు తదితరులు పాల్గొన్నారు.





# పాల్వంచ పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ

- **జిల్లా ఎస్పీ రోహిత్ రాజు ఐపీఎస్**
- **రోడ్డు ప్రమాదాలు, సైబర్ నేరాలపై ప్రజలకు నిత్యం అవగాహన కల్పించాలి**
- **బాధితులకు సత్వర న్యాయం అందించడమే పోలీసుల ప్రథమ కర్తవ్యం**
- **అసాంఘిక శక్తులపై కఠినంగా వ్యవహరించాలని అధికారులకు ఆదేశం**

**భద్రాద్రి కొత్తగూడెం బ్యూరో ,తెలంగాణ చౌరస్తా:**

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఎస్పీ రోహిత్ రాజు ఐపీఎస్ బుధవారం పాల్వంచ పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా స్టేషన్ పరిసరాలను క్షుణ్ణంగా పరిశీలించిన ఆయన, అనంతరం పోలీస్ అధికారులు, సిబ్బందితో ప్రత్యేక సమీక్షా సమావేశాన్ని నిర్వహించి పలు కీలక సూచనలు చేశారు.

**బాధితులకు అండగా నిలవాలి**

పోలీస్ స్టేషన్‌కు వచ్చే బాధితులతో మర్యాదపూర్వకంగా నడుచుకోవాలని, వారి సమస్యలను ఓపికగా విని త్వరితగతిన న్యాయం చేకూర్చే విధంగా ప్రతి ఒక్కరూ బాధ్యతగా మెలగాలని ఎస్పీ సూచించారు. పోలీస్ స్టేషన్ పరిసరాలను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా, ఆహ్లాదకరంగా ఉంచుకోవాలని ఆదేశించారు.

**అసాంఘిక కార్యకలాపాలపై ఉక్కుపాదం**

స్టేషన్ పరిధిలో నమోదైన పలు కేసుల వివరాలను, పురోగతిని ఎస్పీ అడిగి తెలుసుకున్నారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తూ, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వ్యక్తులపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు.

**ప్రజల్లో అవగాహన పెంచాలి**

సమాజంలో రోజురోజుకూ పెరుగుతున్న సైబర్ నేరాలు, రోడ్డు ప్రమాదాల నివారణపై ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులను ఆదేశించారు. పోలీస్ స్టేషన్ పరిధిలోని గ్రామాలలో నిత్యం ప్రజలకు, యువతకు వీటిపై విస్తృతంగా అవగాహన కార్యక్రమాలను ఏర్పాటు చేయాలని పేర్కొన్నారు.

**సిబ్బంది సంక్షేమానికి ప్రాధాన్యత**

విధి నిర్వహణలో సిబ్బంది ఎదుర్కొంటున్న సమస్యలను ఎస్పీ రోహిత్ రాజు స్వయంగా అడిగి తెలుసుకున్నారు. సిబ్బంది వెల్ఫేర్‌కు తమ వంతు ప్రాధాన్యత ఉంటుందని, సమస్యల పరిష్కారానికి ఎల్లప్పుడూ కృషి చేస్తానని వారికి భరోసా ఇచ్చారు.

ఈ ఆకస్మిక తనిఖీ కార్యక్రమంలో పాల్వంచ సీఐ సతీష్ కుమార్, ఎస్సైలు టి. నాగరాజు, జి. విజయ పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



# తెలంగాణ ఉద్యమకారులను ప్రభుత్వం ఆదుకోవాలి

- **తెలంగాణ విద్యార్థి జేఏసీ**

**తొర్రూరు-తెలంగాణ చౌరస్తా:**

తెలంగాణ ఉద్యమకారులకు ఇచ్చిన హామీలు అమలు చేయాలి అని తెలంగాణ ఉద్యమకారులను ప్రభుత్వం ఆదుకోవాలి అని తెలంగాణ విద్యార్థి జేఏసీ నాయకులు అన్నారు.తెలంగాణ విద్యార్థి జేఏసీ ఆధ్వర్యంలో బుధవారం తొర్రూరులో స్థానిక విశ్రాంతి భవనంలో సమావేశం నిర్వహించి మాట్లాడుతూ... తెలంగాణ ఉద్యమకారులను ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్ చేశారు.తెలంగాణ రాష్ట్ర సాధన కోసం విద్యార్థులు తమ చదువులు, జీవితాలను త్యాగం చేసి ఉద్యమంలో కీలక పాత్ర పోషించారని తెలిపారు. బైండోవర్లు, అక్రమ కేసులు, జైలు శిక్షలు ఎదుర్కొన్నప్పటికీ ఉద్యమకారులు వెనకడుగు వేయలేదని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు ఉద్యమకారులను గుర్తించేందుకు కేశవరావు నేతృత్వంలో కమిటీ ఏర్పాటు చేయడాన్ని స్వాగతిస్తున్నామని తెలిపారు. అయితే తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత పదేళ్ల పాటు అధికారంలో ఉన్న భారత్ రాష్ట్ర సమితి ప్రభుత్వం ఉద్యమకారులను ఆదుకోవడంలో విఫలమైందని విమర్శించారు. ప్రస్తుతం అనేక మంది ఉద్యమకారులు ఆర్థిక, సామాజిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఉద్యమకారులను గుర్తించి వారికి 250 గజాల స్థలం, ఇంటి నిర్మాణానికి రూ.5 లక్షల ఆర్థిక సాయం, నెలకు రూ.25 వేల పెన్షన్, హెల్త్ కార్డులు అందించాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా రూ.1000 కోట్ల నిధులతో ఉద్యమకారుల సంక్షేమ బోర్డు ఏర్పాటు చేసి, అర్హులైన విద్యార్థి ఉద్యమకారులకు ప్రభుత్వ ఉద్యోగాలు కల్పించాలని కోరారు. తెలంగాణ అమరవీరుల కుటుంబాలను అన్నివిధాలుగా ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమం లో జేఏసీ నాయకులు రాయిశెట్టి ఉపేందర్, పల్లె కుమార్, పంతం సురేందర్, బంధు మహేందర్, వెల్తూరి మల్లేష్, ఎండీ అమీర్, వెలిశాల శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.



# పొద్దుతిరుగుడు పంటను మద్దతు ధరకు కొనాలి

- **మెదక్ ఎంపీ రఘునందన్ రావు**
- **కేంద్ర మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ కు వినతి**

**పటాన్ చెరు, తెలంగాణ చౌరస్తా :**



యాసంగిలో పండిన పొద్దుతిరుగుడు పంటను మద్దతు ధర ఇచ్చి కొనుగోలు చేయాలని మెదక్ పార్లమెంట్ సభ్యులు మాధవనేని రఘునందన్ రావు కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్‌కు విజ్ఞప్తి చేశారు. హైదరాబాద్ పర్యటనకు విచ్చేసిన కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ కు ఆయన స్వాగతం పలికి, పొద్దుతిరుగుడు పంటకు మద్దతు ధర ఇవ్వడంతో పాటు ధర పెంచాలని వినతి పత్రం అందజేశారు. తెలంగాణలో పొద్దుతిరుగుడు పంట 21091 ఎకరాల నుంచి 27,675 ఎకరాలకు పెరిగిందని, పంట ఉత్పతి కూడా 13935 మెట్రిక్ టన్నుల నుంచి 19373 మెట్రిక్ టన్నులకు పెరిగిందని మంత్రి దృష్టికి తీసుకొచ్చారు. కేవలం 5376 రూపాయల ధర మాత్రమే పలుకుతుందని, కనీస మద్దతు ధర 7721 రూపాయల కనీస మద్దతు ధర వచ్చే విధంగా చూడలాని విజ్ఞప్తి చేశారు. మెదక్ నియోజకవర్గ పరిధిలోని గజ్వేల్, సిద్దిపేట, మెదక్ ప్రాంతాలలో పంట మార్పిడిలో భాగంగా యాసంగిలో పొద్దు తిరుగుడు పంట ఎక్కువగా పండిస్తున్నారని తెలిపారు. దయచేసి వెంటనే పంట పూర్తిగా మద్దతు ధరతో వెంటనే కొనుగోలు చేసే విదంగా సంబంధిత శాఖలకు ఆదేశించాలని కోరారు. తన విన్నపాన్ని సానుకూలంగా స్పందించి సమస్యను పరిష్కరిస్తానని కేంద్ర మంత్రి హామీ ఇచ్చినట్టు ఎంపీ రఘునందన్ రావు తెలిపారు.



# సబ్బితంలో ఉపాధి హామీ కూలీలకు మజ్జిగ పంపిణీ

- **కూలీల యోగక్షేమాలను అడిగి తెలుసుకున్న సర్పంచ్ దంపతులు**
- **వేసవిలో తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచన**

**కమాన్ పూర్ తెలంగాణ చౌరస్తా:**



పెద్దపల్లి మండలం సబ్బితం గ్రామంలో జరుగుతున్న మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పనులను బుధవారం గ్రామ సర్పంచ్ నూనె సరోజన రమేష్ దంపతులు క్షేత్రస్థాయిలో పరిశీలించారు. వేసవి ఎండల తీవ్రత ఎక్కువగా ఉన్న నేపథ్యంలో పని స్థలంలో కూలీలకు కల్పిస్తున్న నీడ, తాగునీరు వంటి సౌకర్యాలను వారు అడిగి తెలుసుకున్నారు. అనంతరం కూలీలకు ఎండదెబ్బ తగలకుండా ఉండేందుకు మజ్జిగ ప్యాకెట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఎండ తీవ్రత దృష్ట్యా కూలీలు తగిన జాగ్రత్తలు తీసుకుంటూ పనులు చేసుకోవాలని సూచించారు. కరువు కాలంలో లభిస్తున్న ఈ ఉపాధి పనులను సద్వినియోగం చేసుకొని గ్రామీణ పేదలు ఆర్థిక స్వావలంబన సాధించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి, వార్డు సభ్యులు, స్థానిక ప్రజాప్రతినిధులు, పంచాయతీ సిబ్బంది, గ్రామ ఉపాధి హామీ కూలీలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.





# ఓఆర్ఆర్ లోపలి రైతుల భూములను రెసిడెన్షియల్ జోన్లుగా మార్చాలి

- **బీజేపీ సంగారెడ్డి జిల్లా అధ్యక్షురాలు గోదావరి**
- **లోక్ భవన్ లో గవర్నర్‌కు వినతి పత్రం అందజేత**

**పటాన్ చెరు, తెలంగాణ చౌరస్తా :**

ఓఆర్ఆర్ లోపలి రైతుల భూములను వెంటనే రెసిడెన్షియల్ జోన్లుగా మార్చాలని బీజేపీ సంగారెడ్డి జిల్లా అధ్యక్షురాలు గోదావరి డిమాండ్ చేశారు. బుధవారం లోక్ భవన్ లో రాష్ట్ర గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా ను జీహెచ్ఎంసీ పరిధిలోని బీజేపీ జిల్లా అధ్యక్షుల బృందం మర్యాదపూర్వకంగా కలిసి, నష్టపోతున్న పేద రైతులకు తక్షణమే న్యాయం చేయాలని కోరుతూ వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. హెచ్ఎండీఏ మాస్టర్ ప్లాన్ జోనింగ్ వ్యవస్థ పేరుతో గత 13 సంవత్సరాలుగా పేద, అమాయక రైతులకు తీవ్ర అన్యాయం జరుగుతుందన్నారు. హైదరాబాద్ మరియు చుట్టుపక్కల జిల్లాల్లోని 1355 రెవెన్యూ గ్రామాల్లో ఉన్న సుమారు 50 వేల మంది పేద రైతుల పాలిట ప్రస్తుత హెచ్ఎండిఏ మాస్టర్ ప్లాన్ ఒక శాపంగా మారిందని మండిపడ్డారు. 2013లో రూపొందించిన ఈ మాస్టర్ ప్లాన్ జోన్లలో గత 13 ఏళ్లుగా ఎలాంటి మార్పులు చేయకపోవడం దారుణమన్నారు. కార్పొరేట్లు, రియల్ ఎస్టేట్ వ్యాపారుల భూములు రెసిడెన్షియల్, మల్టిపుల్ యూజ్ జోన్లలో ఉంటూ వారు బహుళ అంతస్తుల భవనాలు నిర్మించుకుంటుంటే..పేద రైతుల భూములను మాత్రం 'కన్జర్వేషన్ (వ్యవసాయ) జోన్' పరిధిలో ఉంచి ఇళ్ల నిర్మాణాన్ని పూర్తిగా నిషేధించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రింగ్ రోడ్ లోపల ఉన్న పరిశ్రమల భూములను మార్చుకోవడానికి హిల్ట్ పాలసీని తెచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం, పేద రైతుల భూములను మాత్రం 'వ్యవసాయ జోన్' లోనే ఉంచి ఎందుకు కక్ష సాధిస్తోందని ప్రశ్నించారు. ఒకటి లేదా రెండు ఎకరాలు ఉన్న చిన్నకారు రైతు కూడా తన పిల్లల భవిష్యత్తు కోసం, సొంత అవసరాల కోసం ఇల్లు కట్టుకోలేక ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.' హెచ్ఎండీఏ మాస్టర్ ప్లాన్‌ను తక్షణమే సమీక్షించి రైతులకు అనుకూలంగా జోన్లను మార్చాలి. రింగ్ రోడ్ వెలుపల ఉన్న రైతులకు తమ సౌకర్యానుసారం భూమి వినియోగ జోన్ మార్చుకునే అవకాశం కల్పిస్తూ, జోన్ మార్పిడి ప్రక్రియను సులభతరం చేయాలని కోరారు. గౌడవెల్లి, ఘట్‌కేసర్, శంషాబాద్, నాగులపల్లి ప్రాంతాల్లో ఓఆర్ఆర్ సర్వీస్ రోడ్లపై ఉన్న రైల్వే లైన్లకు వెంటనే వంతెనలు నిర్మించాలని, బీజేపీ ఎల్లప్పుడూ రైతుల పక్షాన నిలుస్తుందని, పేద రైతుల సంక్షేమం, వారి హక్కుల సాధన కోసం బీజేపీ రాజీలేని పోరాటం చేస్తుందని అని గోదావరి అన్నారు. ఈ కార్యక్రమంలో ఆమెతో పాటుగా మేడ్చల్ అర్బన్ జిల్లా అధ్యక్షులు మల్లారెడ్డి, మేడ్చల్ రూరల్ జిల్లా అధ్యక్షుడు బుద్ది శ్రీనివాస్, మేడ్చల్ జిల్లా మాజీ అధ్యక్షుడు కాంతరావు, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు శంకర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.









# ప్రజల రక్షణే పోలీసుల లక్ష్యం

- **ఎస్సై నాగరాజు**
- **యడవెల్లిలో పోలీస్ ప్రజాభరోసా అవగాహన కార్యక్రమం**

**నూతనకల్ తెలంగాణ చౌరస్తా:**

ప్రజల రక్షణ కోసం పోలీసులు నిరంతరం కృషి చేస్తున్నారని, సమాచారం అందిన వెంటనే బాధితుల ఇళ్లకు వెళ్లి సేవలు అందిస్తున్నామని నూతనకల్ ఎస్సై నాగరాజు తెలిపారు. జిల్లా ఎస్పీ నరసింహ ఆదేశాల మేరకు నూతనకల్ మండలం యడవెల్లి గ్రామంలో నూతనకల్ పోలీసులు పోలీస్ ప్రజా భరోసా అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా ఎస్సై నాగరాజు మాట్లాడుతూ ప్రజలకు చట్టాలపై అవగాహన కల్పించడం, పౌరులు చట్ట పరిధిలో నడుచుకునేలా చేయడం, ప్రజలకు చేరువగా ఉండి భరోసా కల్పించడమే ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని తెలిపారు. గ్రామాలలో ప్రజలంతా ఐక్యంగా ఉండాలని, చిన్న చిన్న తగాదాలు, గొడవలకు దూరంగా ఉండాలని సూచించారు. భౌతిక దాడులకు పాల్పడకుండా, ఆర్థికపరమైన వివాదాలు వచ్చినప్పుడు పెద్దల సమక్షంలో సామరస్యంగా పరిష్కరించుకోవాలని కోరారు.యువత ఆదర్శంగా ఉండి ఉన్నత చదువులు చదివి మంచి భవిష్యత్తు నిర్మించుకోవాలని సూచించారు. గ్రామాల్లోకి అపరిచితులు లేదా అనుమానాస్పద వ్యక్తులు వస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని ప్రజలను కోరారు.అక్రమ రవాణా నిర్మూలన కోసం పోలీసులు ప్రత్యేక నిఘా ఉంచినట్లు తెలిపారు. అలాగే గ్రామాలకు వచ్చి విత్తనాలు అమ్ముతున్న వారిపై అప్రమత్తంగా ఉండాలని, విడి విత్తనాలు కొనుగోలు చేయవద్దని హెచ్చరించారు. అవి నకిలీ విత్తనాలు అయ్యే అవకాశం ఉందని ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజలు, గ్రామ పెద్దలు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# మెడికల్ షాపుల బంద్ విజయవంతం

- **స్వచ్ఛందంగా షాపులను బంద్ చేసిన నిర్వాహకులు**

**అశ్వారావుపేట తెలంగాణ చౌరస్తా:**







అశ్వారావుపేట భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కెమిస్ట్ అండ్ డ్రగ్గిస్ట్ అసోసియేషన్ అశ్వారావుపేట డివిజన్ పిలుపు మేరకు బుధవారం నిర్వహించిన మెడికల్ షాపుల బంద్ నియోజకవర్గ వ్యాప్తంగా వందశాతం విజయవంతమైంది. అసోసియేషన్ ఐక్యతను చాటుతూ డివిజన్ పరిధిలోని అశ్వారావుపేట , దమ్మపేట మండల కేంద్రాల్లో ఉదయం నుంచే మెడికల్ దుకాణాల నిర్వాహకులు స్వచ్ఛందంగా షాపులను మూసివేశారు. చిన్న, పెద్ద మందుల షాపులతో పాటు హోల్‌సేల్ డిస్ట్రిబ్యూటర్లు, ఆసుపత్రుల అనుబంధ ఫార్మసీలు సైతం వ్యాపారాలను నిలిపివేసి బంద్‌కు మద్దతు తెలిపారు.డివిజన్ వ్యాప్తంగా బంద్ ప్రశాంతంగా సాగుతున్నప్పటికీ, అశ్వారావుపేట లోని భద్రాచలం రోడ్డులో గల మెడిప్లస్ మెడికల్ షాప్ నిర్వాహకుడు బంద్‌లో పాల్గొనేందుకు నిరాకరించారు. బుధవారం ఉదయం ఆయన యథావిధిగా దుకాణాన్ని తెరవడంతో సమాచారం అందుకున్న అసోసియేషన్ నాయకులు అక్కడికి చేరుకున్నారు. డివిజన్ పరిధిలోని మిగిలిన 50 షాపుల వారు అసోసియేషన్ పిలుపును గౌరవించి బంద్ పాటిస్తుంటే, నువ్వు ఒక్కడివి ఎలా నడుపుతావని నాయకులు సదరు నిర్వాహకుడిని ప్రశ్నించారు. దీనికి ఆయన స్పందిస్తూ.. "నా ఇష్టం, నేను బంద్ చేయను" అని కరాకండిగా చెప్పడంతో ఉద్రిక్తత చోటుచేసుకుంది. ఈ క్రమంలో అసోసియేషన్ ప్రతినిధులకు, నిర్వాహకుడికి మధ్య తీవ్ర వాగ్వాదం జరిగి, కొంతసమయం పాటు గందరగోళ పరిస్థితి నెలకొంది. ఎట్టి పరిస్థితుల్లోనూ తన మెడికల్ షాపును మూసివేసే ప్రసక్తే లేదని ఆయన మొండికేయడంతో అసోసియేషన్ నాయకులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు.అసోసియేషన్ ముందుస్తుగా ఇచ్చిన పిలుపు మేరకు ఆసుపత్రుల యాజమాన్యాలు, వైద్యులు ఇన్‌పేషెంట్ల కొరకు అత్యవసర మందులను మంగళవారమే సిద్ధం చేసుకోవడంతో రోగులకు పెద్దగా ఇబ్బందులు తలెత్తలేదు. ఫార్మసీ రంగ ప్రయోజనాల కోసం పిలుపునిచ్చిన ఈ బంద్‌ను విజయవంతం చేసినందుకు, తమకు సహకరించిన డాక్టర్లకు, ఆసుపత్రి యాజమాన్యాలకు, ఫార్మసీ నిర్వాహకులకు కెమిస్ట్ అండ్ డ్రగ్గిస్ట్ అసోసియేషన్ ప్రతినిధి కొణిజర్ల ఉమామహేశ్వర రావు కృతజ్ఞతలు తెలిపారు.

# అభివృద్ధి పనులను వేగవంతం చేయాలి

- భారతీనగర్ మాజీ కార్పొరేటర్ సింధు ఆదర్శ్ రెడ్డి




**పటాన్ చెరు, తెలంగాణ చౌరస్తా :**

భారతీనగర్ డివిజన్ పరిధిలో అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని మాజీ కార్పొరేటర్ సింధు ఆదర్శ్ రెడ్డి కోరారు. బుధవారం జోనల్ కమిషనర్ నారాయణ అమిత్ ను కలిసి పలు అభివృద్ధి పనులు వేగవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. తన కార్పొరేటర్ పదవీ కాలంలో మంజూరైన అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేయాలని జోనల్ కమిషనర్‌ను కోరినట్లు తెలిపారు. ముఖ్యంగా కాంట్రాక్టర్లకు ఆదేశాలు ఇచ్చి పెండింగ్‌లో ఉన్న పనులను త్వరగా పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలని, అలాగే బాంబే కాలనీలోని కమ్యూనిటీ హాల్ అద్దె ప్రస్తుతం ₹15,000గా నిర్ణయించబడిందని, ఆ ప్రాంతం స్లమ్ ఏరియా కావడంతో సాధారణ ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా కనీస అద్దెను నిర్ణయించాలని కోరారు. బాంబే కాలనీ రైతు బజార్‌కు సంబంధించిన టెండర్ ప్రక్రియ ఇప్పటికే పూర్తయిన నేపథ్యంలో, దుకాణాల కేటాయింపు ప్రక్రియను వెంటనే ప్రారంభించి రైతు బజార్‌ను ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు. ఎంఎంటీఎస్ హాల్ట్ రోడ్ నుంచి అన్నమయ్య ఎన్‌క్లేవ్ వరకు ప్రతిపాదిత బీటీ రోడ్ పనులను త్వరితగతిన ప్రారంభించి పూర్తి చేయాలన్నారు. ఈ అంశాలను సానుకూలంగా పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామని జోనల్ కమిషనర్ నారాయణ అమిత్ హామీ ఇచ్చినట్లు సింధు ఆదర్శ్ రెడ్డి తెలిపారు.



# దోరేపల్లి ఎఫ్‌పీఓ ధాన్యం కొనుగోలు కేంద్రం పరిశీలన

**మద్దూర్,తెలంగాణ చౌరస్తా:**

మద్దూర్ మండలంలోని దోరేపల్లి గ్రామంలో ఏర్పాటు చేసిన ఎఫ్‌పీఓ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని మండల వ్యవసాయ అధికారి ఎ.ప్రవీణ్ కుమార్ బుధవారం సందర్శించి కొనుగోలు ప్రక్రియను పరిశీలించారు.ఈ సందర్భంగా రైతులు తీసుకువస్తున్న ధాన్యంలో ప్రభుత్వం నిర్ణయించిన ఫెయిర్ అవరేజ్ క్వాలిటీ (ఎఫ్ఎక్యు) ప్రమాణాలను తప్పనిసరిగా పాటించాలని కేంద్ర నిర్వాహకులకు సూచించారు.ధాన్యంలో తేమశాతం ,మలినాలు,రంగు మారిన గింజలు ఇతర నాణ్యత ప్రమాణాలను సక్రమంగా పరిశీలించి మాత్రమే కొనుగోలు చేయాలని తెలిపారు.రైతులు కూడా ధాన్యాన్ని శుభ్రపరిచి,తగిన విధంగా ఎండబెట్టి కేంద్రాలకు తీసుకురావాలని సూచించారు.నాణ్యత ప్రమాణాలు పాటించడం ద్వారా రైతులకు ప్రభుత్వ మద్దతు ధర సక్రమంగా లభిస్తుందని తెలిపారు.కొనుగోలు చేసిన ధాన్యాన్ని కేంద్రాలలో ఎక్కువ రోజుల పాటు నిల్వ ఉంచకుండా వెంటనే రైస్ మిల్లులకు తరలించే విధంగా చర్యలు చేపట్టాలని సంబంధిత నిర్వాహకులను ఆదేశించారు.ఇటీవల వాతావరణ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని ధాన్యాన్ని సురక్షితంగా నిల్వ ఉంచేందుకు తార్పాలిన్లు మరియు అవసరమైన రక్షణ చర్యలు ఏర్పాటు చేయాలని సూచించారు.అలాగే రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తూకం ప్రక్రియ వేగవంతంగా నిర్వహించి,కొనుగోలు వివరాలను పారదర్శకంగా నమోదు చేయాలని తెలిపారు. రైతులకు ప్రభుత్వం కల్పిస్తున్న ధాన్యం కొనుగోలు సదుపాయాలను సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.ఈ కార్యక్రమంలో ఎఫ్‌పీఓ ప్రతినిధులు,కొనుగోలు కేంద్ర సిబ్బంది,రైతులు పాల్గొన్నారు.



# ఎస్ఎన్డీపీకి లైన్ క్లియర్

- ఎంఎంసీ నుండి నిధులు మంజూరు
- రేవంత్ రెడ్డికి డీసీసీ ప్రెసిడెంట్ వజ్రేష్ యాదవ్ కి ధన్యవాదాలు
- మాజీ మేయర్ అజయ్ యాదవ్, తుంగతుర్తి రవి

**మేడిపల్లి తెలంగాణ చౌరస్తా:**

గత కొన్ని సంవత్సారాలుగా పెండింగ్ లో ఉన్న ఎస్ఎన్డీపీ పనులకు ఎట్టకేలకు లైన్ క్లీయర్ అయ్యింది. బోడుప్పల్ మాజీ మేయర్ చొరవతో మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ వినయ్ కృష్ణరెడ్డి ప్రత్యేక చొరవ తీసుకుని స్టాండింగ్ కౌన్సిల్ తీర్మానం చేయించి నిధులను మంజూరు చేయాడంతో పనులు ప్రారంభం కానున్నాయి.బుధవారం నాడు మేడ్చల్ మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో కమిషనర్ వినయ్ కృష్ణ రెడ్డిని బోడుప్పల్ మాజీ మేయర్ బృందం కలిసింది.ఈ సందర్భంగా మాజీ మేయర్ అజయ్ యాదవ్ మాట్లాడుతూ గత బీఆర్ఎస్ గవర్నమెంట్ లో 110 కోట్లరూపాయలతో పనులు ప్రారంభం అంటూ హడావుడి చేశారే కానీ పనులకు అతిగతి లేకుండా పోయింది.దీంతో పనులు ఎక్కడికక్కడ అగిపోయాయి.అనంతరం కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత అజయ్ యాదవ్ పట్టుపట్టి మరీ ఈ నిధులు మంజూరు చేయించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బోడుప్పల్ సర్కిల్ ప్రజలకు వర్ష కాలంలో వరద బాధలు తీర్చేందుకు గాను ఎస్ఎన్డీపీ నిధులు మంజూరు చేయాడంలో సహకరించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి,జిల్లా ఇంచార్జ మంత్రి శ్రీధర్ బాబు ,ఎంఎంసీ కమిషనర్ ప్రత్యేక అధికారి వినయ కృష్ణ రెడ్డి, డీసీసీ అధ్యక్షుడు తోటకూర వజ్రెష్ యాదవ్ కు ధన్యవాదాలు తెలిపారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు తుంగతుర్తి రవి,బీ బ్లాక్ కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి కొత్త కిషోర్ గౌడ్,మాజీ కార్పొరేటర్ కుంభం కిరణ్ కుమార్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


# ట్రాక్టర్ ఢీకొని బాలురకు గాయాలు

**కాల్వ శ్రీరాంపూర్,తెలంగాణ చౌరస్తా:**

కాల్వ శ్రీరాంపూర్ మండల కేంద్రంలో ట్రాక్టర్ ఢీ కొన సంఘటనలో మండల కేంద్రమైన కాల్వ శ్రీరాంపూర్ చెందిన గ్రామపంచాయతీ టాక్టర్ బుధవారం చెత్త తరలిస్తుండగా బైకుపై ఎదురుగా వస్తున్న ఇద్దరు బాలురు ఢీకొని గాయాలయ్యాయి.దంతనపల్లి మణిదీప్ 12, శశాంక్ 14, కాళ్లకు గాయాలయ్యాయి.స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రథమ చికిత్స నిర్వహించిన అనంతరం మెరుగైన చికిత్స కోసం పెద్దపల్లి ప్రధాన ఆసుపత్రికి తరలించారు.

# కూనారంలో ఈనెల 23 నుంచి విత్తన వారోత్సవాలు

**కాల్వ శ్రీరాంపూర్,తెలంగాణ చౌరస్తా:**



కాల్వ శ్రీరాంపూర్ మండలంలోని కూనారం గ్రామాల్లో గల ప్రొఫెసర్ జయ శంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో వ్యవసాయ పరిశోధన కేంద్రంలో ఈనెల 23 నుంచి 30 వరకు విత్తన వారోత్సవాలు నిర్వహించనున్నట్లు సీనియర్ శాస్త్రవేత్త డా.సతీశ్ చంద్ర బుధవారం తెలిపారు.ఇక్కడ అభివృద్ధి చేసిన అత్యుత్తమ రకం 'కూనారం సన్నాలు (కె.ఎన్.ఎమ్ 1638)' ఫౌండేషన్ విత్తనాలు రైతులకు అందుబాటులో ఉన్నాయన్నారు.విత్తనాల కొనుగోలు,ఇతర వివరాల కోసం 8333818202 నంబరును సంప్రదించాలని కోరారు.





# కాలనీలను ఆదర్శంగా తీర్చిదిద్దుతాం

- బీరంగూడ, అమీన్ పూర్ డివిజన్లలో సుడిగాలి పర్యటన
- ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి

**పటాన్ చెరు, తెలంగాణ చౌరస్తా :**

అమీన్ పూర్, బీరంగూడ డివిజన్ల పరిధిలోని ప్రతి కాలనీని అభివృద్ధిలో ఆదర్శంగా తీర్చిదిద్దేందుకు ప్రణాళికాబద్ధంగా నిధులు కేటాయిస్తున్నామని ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. బుధవారం అమీన్ పూర్, బీరంగూడ డివిజన్ల పరిధిలోని తులసివనం కాలనీ, భ్రమరాంబిక నగర్ కాలనీ, ఏ ఆర్ బృందావన్ కాలనీ, కెఎస్ఆర్ కాలనీ, అంజనాద్రి కాలనీ, టైలర్ కాలనీ, ఎన్ఎస్ఎల్ కాలనీ, ఎన్ బీఆర్ కాలనీ, ఇక్రిశాట్ కాలనీలలో అమీన్ పూర్ మున్సిపల్ మాజీ చైర్మన్ తుమ్మల పాండురంగారెడ్డి, మాజీ వైస్ చైర్మన్ నందారం నరసింహ గౌడ్, అమీన్ పూర్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ ప్రదీప్ కుమార్, వివిధ శాఖల అధికారులతో కలిసి ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి పర్యటించారు. నేరుగా ప్రజలు, ఆయా కాలనీల సంక్షేమ సంఘాల ప్రతినిధులతో సమావేశమై క్షేత్రస్థాయిలో వారు ఎదుర్కొంటున్న సమస్యలను నేరుగా అడిగి తెలుసుకున్నారు. ప్రధానంగా సీసీ రోడ్లు, యూజీడీలు, విద్యుత్, తాగు నీరు తదితర అంశాలపై చర్చించారు. అన్ని శాఖల అధికారులు సమన్వయం చేసుకుంటూ క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ ప్రజల ఎదుర్కొంటున్న సమస్యలను నివేదిక రూపంలో తనకు అందించాలని ఆదేశించారు. ఇందుకు అనుగుణంగా నిధులు కేటాయించి నిర్దేశించిన గడువుగా పనులు పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకొని వస్తామని తెలిపారు. అమీన్ పూర్ పరిధిలో దశాబ్దాల కాలంగా అపరిష్కృతంగా ఉన్న మంచినీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపెట్టడంతో పాటు.. ప్రతి ఇంటికి తాగునీరు అందిస్తున్నామని తెలిపారు. నూతన కాలనీలకు సైతం అందించేందుకు ఇప్పటికే ప్రణాళికలు పూర్తయ్యాయని తెలిపారు. కాలనీలలో ప్రభుత్వ స్థలాలు పార్కులు కబ్జాలు గురికాకుండా కృషి చేస్తున్నట్లు తెలిపారు. పారిశుద్ధ్య విషయంలో ప్రజలకు ఇబ్బందులకు తలెత్తకుండా నూతన సిబ్బందిని సైతం నియమిస్తున్నట్లు తెలిపారు. నూతన కాలనీలు ఏర్పడడంతో విద్యుత్ డిమాండ్ పెరిగిందని.. ఇందుకు అనుగుణంగా నూతన సబ్ స్టేషన్లతోపాటు పవర్ ట్రాన్స్ఫార్మర్లు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఎన్నికల సమయంలో మాత్రమే రాజకీయాలు మాట్లాడటం తన నైజం అని.. మిగతా సమయం ప్రజల అభివృద్ధి సంక్షేమ ప్రధాన లక్ష్యమని తెలిపారు. అభివృద్ధిలో ప్రజలు సైతం భాగస్వాములు కావాలని విజ్ఞప్తి చేశారు. ప్రజల సమస్యల పరిష్కారంలో అధికారులు నిర్లక్ష్యం చేయకూడదని.. అవసరమైన నిధులు అందించేందుకు తాను సిద్ధంగా ఉన్నట్టు తెలిపారు. అతి త్వరలో బీరంగూడలో వివిధ అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేయనున్నట్లు తెలిపారు. తమ సమస్యల పరిష్కారానికి నేరుగా ఎమ్మెల్యేనే స్వయంగాతమ కాలనీలకు రావడం పట్ల ఆయా కాలనీల ప్రతినిధులు, ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ప్రజా ప్రతినిధులు బాలరాజు, కృష్ణ, యూనుస్, ఇంజనీరింగ్ విభాగం ఈఈ సురేష్,డిఈ వెంకటరమణ, జలమండలి డిజిఎం శివకుమార్, విద్యుత్ శాఖ ఏడి సంజీవ్, మాజీ ప్రజాప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.






# శ్రీకృష్ణవేణి టాలెంట్ స్కూల్ బస్సులను సీజ్ చేయాలి

- స్కూల్ యాజమాన్యం పై చర్యలు తీసుకోవాలి
- మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ శ్రీకాంత్ చక్రవర్తిగారికి వినతి
- పిడిఎస్యు ఉమ్మడి కరీంనగర్ జిల్లా ప్రధాన కార్యదర్శి కూతాటి రాణా ప్రతాప్




**కరీంనగర్, తెలంగాణ చౌరస్తా:**

శ్రీకృష్ణవేణి టాలెంట్ స్కూల్ బస్సులను తక్షణమే సీజ్ చేసి యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని,పాఠశాల బస్సును నిబంధనలకు విరుద్ధంగా పెళ్లిళ్లకు ఫంక్షన్లకు ఉపయోగిస్తున్న బస్సులను తక్షణమే సీజ్ చేయాలని మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ శ్రీకాంత్ చక్రవర్తికి పిడిఎస్యు ఉమ్మడి కరీంనగర్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో జిల్లా అధ్యక్ష,కార్యదర్శులు లోకిని రమేష్,కూతాటి రాణా ప్రతాప్ వినతి పత్రాన్ని అందజేయడం జరిగింది.ఈ సందర్భంగా పిడిఎస్యు ఉమ్మడి కరీంనగర్ జిల్లా ప్రధాన కార్యదర్శి కూతాటి రాణా ప్రతాప్ మాట్లాడుతూ.....కరీంనగర్ పట్టణ కేంద్రంలోని రామ్ నగర్ శ్రీ కృష్ణవేణి టాలెంట్ స్కూల్ యాజమాన్యం ఇష్టం వచ్చినట్టు వ్యవహరిస్తూ,నిబంధనలు పాటించకుండా యాజమాన్యాలు కాసులకు కక్కుర్తి పడి విద్యార్థుల బస్సులను వివాహాలకు ఫంక్షన్లకు దూర ప్రాంతాలకు పంపియడం జరుగుతుందని,ఇలా ఫంక్షన్లకు పెళ్లిళ్లకు పంపియడం వల్ల ఎక్కువగా ప్రమాదాలు జరుగుతాయని,ఎందుకంటే ప్రైవేటు బస్సులలో విద్యార్థుల సామర్థ్యం బట్టి ఎక్కించుకుంటారు,కానీ పెళ్లిళ్లకు ఫంక్షన్లకు వాళ్ళ ఇష్టం వచ్చినట్లు ఎక్కించుకోవడం వల్ల ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు.తక్షణమే ఆ పాఠశాల యొక్క బస్సును సీజ్ చేసి యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నామని,లేనియెడల ఆందోళన కార్యక్రమాలను ఉదృతం చేస్తామన్నారు .ఈ కార్యక్రమంలో పి డి ఎస్ యు ఉమ్మడి కరీంనగర్ జిల్లా అధ్యక్షులు లోకిని రమేష్ తోపాటు, పలువురు జిల్లా నాయకులు పాల్గొన్నారు.



# కెరియర్ గైడెన్స్, కౌన్సెలింగ్‌లపై శిక్షణ

- గంట రవికుమార్ విద్యార్థులతో ముఖాముఖి

**వరంగల్, తెలంగాణ చౌరస్తా:**

గంట రవికుమార్ ఫౌండేషన్ ఉచిత ట్యూషన్ ద్వారా ఇటీవల విడుదలైన పదవ తరగతి ఫలితాలలో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులందరికీ గంట రవికుమార్ ఫౌండేషన్ హృదయపూర్వక అభినందనలు.ఈ సందర్భంగా శివనగర్ గోల్డెన్ ఓక్ స్కూల్లో విద్యార్థులతో మాట్లాడుతూ... ఈ విజయం మీ భవిష్యత్తు ప్రయాణానికి మొదటి అడుగు మాత్రమే. పదవ తరగతి తర్వాత ఏ కోర్సు ఎంచుకోవాలి? ఏ రంగాన్ని ఎంచుకుంటే మంచి భవిష్యత్తు ఉంటుంది? అనే విషయాలపై విద్యార్థులకు సరైన మార్గదర్శకత్వం అందించడానికి ప్రత్యేక కెరియర్ గైడెన్స్ వివరించిన గంట రవికుమార్.విద్యార్థులు తమ సందేహాలను నివృత్తి చేసుకోవడానికి, నిపుణులతో మాట్లాడటానికి మా ఫౌండేషన్ ద్వారా ఉచిత కౌన్సెలింగ్ అందుబాటులో ఉంటుందని,ప్రతి ఒక్క విద్యార్థి సరైన నిర్ణయం తీసుకొని ఉజ్వల భవిష్యత్తును నిర్మించుకోవాలని ఆకాంక్షిస్తున్నామన్నారు.

# జిల్లాలో అబ్కారీ రథసారథి ఉన్నారా? లేరా?..

- మత్తులో యంత్రాంగం.. కిక్కులో బెల్ట్ దందా!
- అవినీతి నిరోధక శాఖ ఉక్కుపాదం మోపాల్సిందే!
- ఠాణాలు ఉన్నాయి.. అధికారులు అదృశ్యం పల్లె పల్లెనా వెలిసిన అక్రమ మద్య సామ్రాజ్యం!
- మామూళ్ల మైకంలో జిల్లా అబ్కారీ బాస్.. నిద్రపోతున్న నిఘా విభాగం!
- 'కాకి కాకి ముక్కు పొడవదు'.. లంచగొండి తిమింగలాల గుట్టు తేల్చాల్సింది 'ఏసీబీ' మాత్రమే!



**భద్రాద్రి కొత్తగూడెం బ్యూరో, తెలంగాణ చౌరస్తా:**

భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో అక్రమ మద్యం విక్రయాలు, బెల్ట్ షాపుల దందా పరాకాష్టకు చేరింది. ఇక్కడ అబ్కారీ (ఎక్సైజ్) శాఖ చట్టాన్ని అమలు చేస్తోందా.. లేక మద్యం మాఫియాకు ఎర్రవాసి పరుస్తోందా? అనే అనుమానాలు ప్రజల్లో బలంగా వ్యక్తమవుతున్నాయి. జిల్లాలో అబ్కారీ పోలీస్ స్టేషన్ల బోర్డులు, రంగుల గోడలు మాత్రమే దర్శనమిస్తున్నాయి తప్ప, క్షేత్రస్థాయిలో అక్రమాలను అరికట్టాల్సిన అధికారులు మాత్రం అస్సలు కనిపించడం లేదు. వ్యవస్థాపటిమ కన్నా.. నెలనెలా అందే 'మామూళ్ల' పటిమే ఎక్కువగా ఉందన్న విమర్శలు ఇప్పుడు జిల్లావ్యాప్తంగా దావానలంలా మారుమోగుతున్నాయి.

**అసలు జిల్లా ప్రధాన అధికారి ఉన్నారా? లేరా?**

జిల్లా అబ్కారీ రథసారథిగా ఉంటూ మొత్తం యంత్రాంగాన్ని పరుగులు పెట్టించాల్సిన జిల్లా అబ్కారీ సూపరింటెండెంట్ అసలు జిల్లాలో ఉన్నారా? లేక కార్యాలయానికే పరిమితమై నిద్రిస్తున్నారా? అని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ఇంత పెద్ద ఎత్తున అక్రమ మద్యం దుకాణాలు నడుస్తున్నా, నిబంధనలు గాలికి ఎగురుతున్నా జిల్లా బాస్ కళ్లు మూసుకోవడం వెనుక ఉన్న మర్మమేంటి? క్షేత్రస్థాయి అధికారులను పర్యవేక్షించడంలో, అక్రమాలకు అడ్డుకట్ట వేయడంలో ప్రధాన అధికారి ఘోరంగా విఫలమయ్యారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఉన్నతాధికారే ఉదాసీనంగా ఉంటే,కింద స్థాయి సిబ్బందికి 'మామూళ్ల పండగే' కదా అని స్థానికులు మండిపడుతున్నారు.

**ఠాణాలు ఉన్నాయి.. కానీ అధికారులు ఎక్కడ?**

ప్రభుత్వ నిబంధనల ప్రకారం ప్రతి గల్లీలోనూ వెలిసిన బెల్ట్ షాపులను ఇనుప పాదంతో తొక్కేయాల్సిన బాధ్యత అబ్కారీ అధికారులదే. ఇందుకోసం జిల్లాలో పోలీస్ స్టేషన్లు ఉన్నాయి, సాయుధ సిబ్బంది ఉన్నారు, ప్రభుత్వ వాహనాలూ ఉన్నాయి. కానీ, తీరా క్షేత్రస్థాయిలో చూస్తే బెల్ట్ షాపులు యథేచ్ఛగా, మూడు పువ్వులు ఆరు కాయలుగా నడుస్తున్నాయి. అధికారులు ఏ చల్లటి గదుల్లో దాక్కున్నారో, ఎవరి అండ చూసుకుని మిన్నకుండిపోయారో అర్థం కావడం లేదు. మద్యం వ్యాపారుల అక్రమ దందాకు ఎదురులేకుండా పోతుంటే, అధికారులు మాత్రం తాము విధి నిర్వహణ చేస్తున్నట్టు నటిస్తూ కాలం వెళ్లదీస్తున్నారు.

**అక్రమాలకు అండ.. నిఘా విభాగం ఊసే లేదు!**

అబ్కారీ అధికారుల ఈ ఘోర మౌనం వెనుక ఉన్న 'ఆర్థిక' ఒప్పందాలు ఇప్పుడు బహిరంగ రహస్యమే. మరోవైపు, ఇటువంటి శాఖాగత అవినీతిని, అక్రమాలను నిరంతరం పర్యవేక్షించాల్సిన నిఘా (విజిలెన్స్) అధికారులు అసలు కొత్తగూడెం జిల్లా వైపే కన్నెత్తి చూడటం లేదు. వారి పర్యవేక్షణ లోపం వల్ల, బెల్ట్ షాపుల నిర్వాహకులకు ఇది సువర్ణ అవకాశంగా మారింది. అధికారుల కళ్ల ముందే అడ్డగోలుగా, నిర్ణీత ప్రభుత్వ ధరకంటే ఎక్కువ ధరకు మద్యం అమ్ముతున్నా, కనీసం ఒక్క కేసైనా నమోదు చేయకపోవడం వెనుక పెద్ద లంచాల నెట్‌వర్కే నడుస్తోందని స్పష్టమవుతోంది.

**సొంత తనిఖీలు వద్దు.. 'అవినీతి నిరోధక శాఖ' (ఏసీబీ) దాడులే కావాలి!**

ఇకనైనా ఈ దందాకు, అవినీతి కూటమికి అడ్డుకట్ట పడాలంటే కేవలం అబ్కారీ శాఖ అంతర్గత తనిఖీలు సరిపోవు. ఎందుకంటే 'కాకి కాకి ముక్కు పొడవదు' అన్న చందంగా సొంత శాఖ అధికారులు ఒకరినొకరు కాపాడుకునే ప్రయత్నం చేస్తారు. లంచగొండితనాన్ని మూలాల నుంచి పెకలించాలంటే స్వతంత్ర విభాగమైన అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) రంగంలోకి దిగాల్సిందే.ఆకస్మిక దాడులు జరగాలి జిల్లాలోని అబ్కారీ స్టేషన్లపై, ఉన్నతాధికారుల కార్యాలయాలపై, వారి నివాసాలపై అవినీతి నిరోధక శాఖ ప్రత్యేక బృందాలు ఆకస్మిక దాడులు జరపాలి.

**మామూళ్ల చిట్టా బయటపడాలి**

మద్యం సిండికేట్ల నుంచి అధికారులు వసూలు చేస్తున్న నెలవారీ 'మామూళ్ల చిట్టాలను' ఏసీబీ అధికారులు నడిబజార్లో పెట్టాలి. ఆదాయానికి మించిన ఆస్తుల కోణంలో విచారణ జరపాలి.

## సస్పెన్షన్ వేటు పడాలి

బాధ్యతారహితంగా వ్యవహరిస్తూ మద్యం మాఫియాకు సహకరిస్తున్న అధికారులను తక్షణమే ఉద్యోగం నుండి తొలగించి, కఠిన చట్టాల కింద జైలుకు పంపాలి.కేవలం కుర్చీల్లో కూర్చుని సంతకాలు పెడితే బాధ్యత తీరిపోదు. క్షేత్రస్థాయిలో ప్రజల ప్రాణాలతో, యువత భవిష్యత్తు తో ఆడుకుంటున్న ఈ మద్యం అవినీతి తిమింగలాలపై అవినీతి నిరోధక శాఖ అధికారులు నిఘా పెట్టాలి. ఏసీబీ దాడులు జరిగితే తప్ప కొత్తగూడెం జిల్లా అబ్కారీ శాఖలో పేరుకుపోయిన అవినీతి లీలలు, బెల్ట్ షాపుల అసలు భాగోతం బయట పడవు. మరి ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందిస్తారో.. లేదో చూడాలి!

